చెరువు నిండక.. పంటలు పండక!

- నిండని వెంగళాయిదొడ్డి చెరువు
- రెండేళ్లుగా పంటలకు దూరమైన రైతులు
- బీడుగా మారిన ఆయకట్టు
- బోర్లలో పడిపోయిన నీటి మట్టం
- హంద్రీనీవా నీటితో నింపాలంటున్న రైతులు

సరైన వర్షాలు లేక చెరువుల్లోకి వర్షపునీరు చేరలేదు. దీంతో చెరువుల పరిధిలోని ఆయకట్టు భూములు పంటల సాగుకు నోచుకోవడం లేదు. ఆస్పరి మండలంలోని వెంగళాయిదొడ్డి చెరువుకు రెండేళ్లుగా వర్షపునీరు చేరడం లేదు. చెరువు కింద ఏటా వరి పంట సాగుచేసే రైతులు.. రెండేళ్లుగా పొలాలను బీడుగా ఉంచుకున్నారు. ఇక చెరువులో నీరు లేకపోవడంతో చెరువు పరిధిలోని గ్రామాల్లోని వ్యవసాయ బోర్లలో ఊట పడిపోయింది. దీంతో వాటి కింద కూడా అరకొరగా పంటలు పండుతున్నాయి. చెరుసు హంద్రీనీవా నీటితో నింపితే దాదాపు 2వేల ఎకరాలకుపైగా లబ్ధి చేకూరుతుందని రైతులు కోరుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు.


పూర్తిగా నిండని వెంగళాయిదొడ్డి చెరువు


బీడుగా మారిన ఆయకట్టు భూములు

ఆస్పరి: వర్షాభావంతో రెండేళ్లుగా మండలంలోని వెంగళాయిదొడ్డి చెరువుకు నిండలేదు. దీంతో చెరువు ఆయకట్టు భూముల్లో విత్తనం వేయక బీడుగా మారిపోయాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు భారీ వర్షాలు పడకపోవడంతో చెరువు పూర్తిగా నిండలేదు. ఈ నెల మొదటి వారంలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసినా ఫలితం లేకపోయింది. వెంగళాయిదొడ్డి చెరువు 740 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఎగువ ప్రాంతంలోనున్న బైలుపత్తికొండ, చిన్నపెండేకల్లు, పెద్దపెండేకల్లు, గార్లపెంటతో ఆదోని మండలాల్లోని పలు గ్రామాల వర్షపునీరు వచ్చి చేరుతుంది. ఇటీవల కురిసిన వర్షాలు ఆయా గ్రామాల్లో అరకొరగా పడటంతో ఎగువ ప్రాంతాల నుంచి నీటి చేరిక తగ్గింది. దీంతో చెరువు పూర్తిగా నిండలేదు.

సాగుకు దూరమైన రైతులు..

వెంగళాయిదొడ్డి చెరువుకు ఈ ఏడాది కూడా వర్షపు నీటితో నిండలేదు. చెరువు ఆధారంగా 1,500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువు నీటి ఆధారంగా ఈ పొలాల్లో పంటలు సాగు చేస్తారు. ఏటా చెరువు నీటితో వరి విస్తారంగా సాగయ్యేది. రెండేళ్లుగా చెరువుకు నీటి చేరిక అంతంతమాత్రంగానే ఉండటంతో పంటలు సాగు చేయలేదు. వర్షాధార పంటలు వేద్దామన్నా.. వర్షాభావం వెంటాడుతుండటం రైతులకు శాపంగా మారింది. దీంతో ఆయకట్టు పొలాలు బీడుగా మారాయి. ప్రస్తుతం ఆయా పొలాల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. వచ్చే ఏడాది పంటలు సాగు చేయాలన్నా.. పొలాలను పూర్వపు స్థితికి తీసుకొచ్చేందుకు తమకు భారీగా ఖర్చవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

హంద్రీనీవా నీటిని మళ్లించాలి..

కొన్నేళ్లుగా వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో చెరువుల్లో నీటి చేరిక గణనీయంగా పడిపోయింది. దీంతో ఈ చెరువును హంద్రీనీవా నీటితో నింపాలని కొన్నేళ్లుగా రైతులు డిమాండ్ చేస్తున్నారు. చెరువులో నీరు చేరితే వెంగళాయిదొడ్డితో పాటు కారుమంచి, కైరుప్పల, చెన్నంపల్లికి చెందిన 800 మంది రైతులు నీటి ఆధారిత పంటలు సాగు చేసుకునే వీలుంటుంది. అలాగే.. చెరువు సమీప గ్రామాల్లోని వ్యవసాయ బోర్లలో కూడా జలధార పెరుగుతుందని, అక్కడ కూడా పంటలు సాగు మరింత పెరిగే అవకాశముంటుందని చెబుతున్నారు. చెరువు ఆయకట్టు 1,500 ఎకరాలతో పాటు ఆయా గ్రామాల్లో బోర్ల పరిధిలో 500 ఎకరాలకు పైగా పంటలు సాగయ్యే అవకాశముంది. హంద్రీనీవా నీటిని తరలిస్తే.. దాదాపు 2వేల ఎకరాలకు పైగా పంటలు పండే అవకాశముందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చెరువును హంద్రీనీవా నీటితో నింపాలని అన్నదాతలు కోరుతున్నారు.

బోర్లలో తగ్గిన జలధార..

740 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులో నీరు సమృద్ధిగా ఉంటే.. చెరువు సమీప గ్రామాల్లోని వ్యవసాయ బోర్లలో నీటి ఊట బాగా వచ్చేది. చెరువును దృష్టిలో ఉంచుకొని సమీప గ్రామాల్లో దాదాపు 250 వ్యవసాయ బోర్లను రైతులు తవ్వించుకున్నారు. జలధార పుష్కలంగా ఉంటే బోర్ల కింద వారు కూడా వరి పంట వేసేవారు. తక్కువ ఊట ఉంటే అధికంగా కూరగాయల పంటలు, పత్తి సాగు చేస్తారు. ఎక్కువగా చౌకాయ, బీరకాయ, టమాట, వంకాయ తదితర పంటలు వేస్తారు. అయితే రెండేళ్లుగా చెరువులో నీరు లేకపోవడంతో వారికి శాపంగా మారింది. వరితో పాటు కూరగాయల పంటల సాగు విస్తీర్ణం కూడా భారీగా పడిపోయింది.

వరి పంట సాగు చేయలేదు



చెరువు ఆయకట్టు కింద నాకు 5 ఎకరాల పొలం ఉంది. రెండు సంవత్సరాలు నుంచి వర్షాలు రాకపోవడంతో వరి పంట వేయక బీడుగా వదిలేశా. వర్షాధారంగా చెరువు నిండితేనే పంటలు పండించుకుంటున్నాం. రెండు సంవత్సరాలుగా పంటలు వేసుకోకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాం.

– రంగన్న, రైతు, కైరుప్పల గ్రామం

భూములు బీడుగా మారాయి



ఖరీఫ్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పెద్ద వర్షాలు కురవకపోవడంతో చెరువులోకి నీరు చేరలేదు. దీంతో చెరువు కింద భూములు బీడుగా మారాయి. నాకు చెరువు కింద 6 ఎకరాలు ఆయకట్టు ఉంది. భూములన్నా పంటలు పండించుకోలేకపోతున్నాం. ఏటా వరుణదేవుడు కరుణిస్తేనే పంటలు సాగు చేసుకుంటున్నాం.

– వీరేష్, కైరుప్పల

హంద్రీ నీవా ద్వారా చెరువు నింపాలి



వర్షాధారంతోనే కాకుండా హంద్రీ నీవా నీటితో చెరువును నింపాలి. చెరువులో నీరుంటే నాలుగు గ్రామాలకు చెందిన రైతులు వరి పండించుకుంటాం. అంతేగాక చుట్టుపక్కనున్న గ్రామాల్లో ఉన్న దాదాపు 250 బోర్లులో నీటి మట్టం పెరగుతుంది. చెరువులో నీరు లేకపోవడంతో నాకున్న ఎకరన్నర భూమి బీడుగా వదిలేశా. హంద్రీ నీవా ద్వారా చెరువుకు నీరు వచ్చేలా చేయాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంగళాయిదొడ్డి చెరువుకు హంద్రీనీవా నీటిని సరఫరా చేసి రైతుల కష్టాలను తీర్చాలి.

– పంపన్న గౌడు, వెంగళాయిదొడ్డి

క్లుప్తంగా

జీవాల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

తుగ్గలి : జీవాల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పెంపకందారులకు లైవ్‌స్టాక్ అసిస్టెంట్(ఎల్ఎస్ఏ) పీర్‌బాషా సూచించారు. రిలయన్స్ ఫౌండేషన్, అపార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం సూర్యతండా, మీటీతండాల్లో జీవాలకు టీకాలు వేశారు. జీవాలకు సోకే వ్యాధులు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకరమ్మ, అపార్డ్ సంస్థ ప్రతినిధి సురేష్ పాల్గొన్నారు.

నవభారత నిర్మాణానికి యువతే రథసారథులు


బహుమతులు అందజేస్తున్న అధికారులు

మద్దికెర : నవ భారత్ నిర్మాణానికి యువతే రథసారథులని ఎంపీడీఓ స్వర్ణలత, ఎంఈఓ గోపాల్ అన్నారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ ఆధ్వర్యంలో దేశ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో విద్యనభ్యసించి నవభారత నిర్మాణానికి తమ వంతు కృషి చేసి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రిన్సిపాల్ సవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి



మద్దికెర: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామ ఎస్సీ కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి జల్‌జీవన్ మిషన్ కింద రూ.58 లక్షలతో చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తయ్యిందని సర్పంచ్ బురుజుల విజయుడు, కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి ట్రయల్‌రన్ కూడా నిర్వహించామన్నారు. త్వరలోనే కాలనీకి నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

చెత్తబుట్టల మంజూరు

మద్దికెర : మండలంలోని 8 పంచాయతీలకు గాను 17,498 చెత్త బుట్టలు మంజూరయ్యాయని ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి గురువారం తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా బుట్టలు వచ్చాయని, త్వరలోనే పంచాయతీలకు పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రజలు చెత్తను బయట వేయకుండా బుట్టలో వేసి పారిశుద్ధ్య సిబ్బంది వచ్చినపుడు అందజేసి గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు సహకరించాలని కోరారు.

ఎస్‌బీ కానిస్టేబుల్‌కు అవార్డు



ఎస్పీ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న వీరేంద్ర

పత్తికొండ(తుగ్గలి): పత్తికొండకు చెందిన స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ వీరేంద్ర ఉత్తమ ఎస్‌బీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. కర్నూలు ఎస్పీ కార్యాలయంలో గురువారం జిల్లా ఎస్పీ బిందు మాధవ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, నగదు అవార్డు అందుకున్నారు. గత నెల 14న హోసూరు టీడీపీ నేత వాకిటి శ్రీనివాసులు హత్యకు గురయ్యారు. ఈ కేసు ఛేదనలో పోలీసులు ఉన్నతాధికారులకు పక్కా సమాచారం అందించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపడంతో ఎస్పీ నుంచి నగదు అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు.

చాకలి ఐలమ్మ జయంతి


ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజకులు

హొళగుంద: మండల కేంద్రంలో గురువారం రజకులు చాకలి ఐలమ్మ జయంతిని జరుపుకున్నారు. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రజక సంఘం నాయకులు మాట్లాడుతూ సాయుధ రైతాంగ పోరాటంలో తనవంతు పాత్ర పోషించిన వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. నాగరాజు, ఎల్ఐసీ లక్ష్మన్న, సప్లయర్ నాగరాజు, మల్లికార్జున, కరెంట్ మల్లి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న తుగ్గలి, అర్ధగేరి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

తుగ్గలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్–17 విభాగం ఫుట్‌బాల్ పోటీల్లో పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలకు చెందిన దీపిక, రాజేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ పాండురంగరాజు గురువారం తెలిపారు. ఈనెల 28 నుంచి వినుగొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున వీరు ఆడుతారని చెప్పారు. హెచ్ఎం నరేంద్ర, ఫిజికల్ డైరెక్టర్, ఉపాధ్యాయులు, పీఎంసీ చైర్‌పర్సన్ అమీనాబేగం అభినందించారు.

హాలహర్వి: మండలంలోని అర్ధగేరి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రమణయ్య తెలిపారు. గురువారం స్థానిక పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ బాల్ బ్యాడ్మింటన్ అండర్–14 పోటీల్లో కె.కవిత, ఈ.అక్షయ, డి.హేమంత్ రాజు, అండర్–17లో బి.హిందు, కె.మహేంద్ర కర్నూలు జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను పీఈటీ వీరేష్, ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

ఆలూరు పీఆర్ డీఈగా మనోహర్



ఆలూరు: ఆలూరు పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న మనోహర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈ టి.శ్రీరాములు అనంతపురం జిల్లా ధర్మవరానికి బదిలీ అయ్యారు. నూతనంగా డీఈకి ఆలూరు, దేవనకొండ, హాలహర్వి, చిప్పగిరి, ఆస్పరి, హొళగుంద మండలాల పీఆర్ ఇంజినీర్లు, కార్యాలయ సిబ్బంది, వివిధ మండలాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా.. మనోహర్ పాణ్యం డీఈగా పనిచేస్తూ.. బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఇది ముంచే ప్రభుత్వం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

దేవనకొండ: కూటమి ప్రభుత్వం.. ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని చేపట్టిందని, కానీ.. ఇచ్చిన హామీలు నెరవేర్చని, సంక్షేమాన్ని పట్టించుకోని, ప్రజా సమస్యలను పట్టించుకోని ఈ ప్రభుత్వం ముంచే ప్రభుత్వమని ఎమ్మెల్యే బి.విరూపాక్షి విమర్శించారు. గురువారం ఆయన మండలంలోని కొత్తపేట గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా పింఛన్ తప్పా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయలేదన్నారు. వంద రోజుల పాలన భేష్ అంటూ సొంత డబ్బా కొట్టుకోవడమే తప్పా ప్రజలకు చేసిందేమి లేదన్నారు. తల్లికి వందనం, రైతులకు పెట్టుబడి సాయం అమలుపై ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. యువత ఎంతో నమ్మకంతో పవన్‌కళ్యాణ్‌ను గెలిపిస్తే.. చంద్రబాబునాయుడు చెప్పిన మాటలకు వత్తాసు పలకడమే తప్పా సొంత నిర్ణయాలు తీసుకోలేకపోవడంతో ఆయనపై ఆశలు సన్నగిల్లాయన్నారు. సీఎం చంద్రబాబునాయుడు తిరుమల లడ్డూపై దుష్ప్రచారంతో ప్రజలను డైవర్ట్ చేస్తున్నాడన్నారు. జెడ్పీటీసీ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, కొత్తపేట సర్పంచ్ బాబు, తెర్నెకల్ సర్పంచ్ అరుణ్‌కుమార్, నాయకులు లుమాంబ, దివాకర్‌నాయుడు, గఫూర్, ఆనంద్, సోమిరెడ్డి పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుగ్గలి: మండలంలోని జొన్నగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలతో పాటు జొన్నగిరి, ఎర్రగుడి టౌన్ ఫీడర్లకు ఈ నెల 28వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మహేశ్వరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తుగ్గలి నుంచి జొన్నగిరి మధ్యన స్తంభాల ఏర్పాటు, మరమ్మతుల కారణంగా 28న ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల రైతులకు త్రీఫేస్ విద్యుత్ సరఫరాను 28న అర్ధరాత్రి 12 నుంచి ఉదయం 8 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

రేపు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆలూరు:వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 28వ తేదీన అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని, ఇందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తరలిరావాలని ఆలూరు ఎమ్మెల్యే బి. విరూపాక్షి గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. తన రాజకీయాల కోసం సీఎం చంద్రబాబు తిరుమల లడ్డూపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులతో హెచ్ఎం, టీచర్లు

హొళగుంద: ఈ నెల 25న ఆలూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ అండర్–14 విభాగంలో హొళగుంద నేతాజీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన ఎం అపూర్వ, హరికృష్ణ, కె. భరత్ కబడ్డీ పోటీల్లో, పి.రాజాసాబ్ డిస్క్ త్రో పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం గోపీనాథ్, కరెస్పాండెంట్ మల్లికార్జున, పీఈటీ యూసూఫ్ గురువారం తెలిపారు.

రుచిగా వండకపోతే ఏజెన్సీల రద్దు


హత్తిబెళగల్ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ చిరంజీవి రెడ్డి

ఆలూరు: ప్రభుత్వ పాఠశాలలో నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికంగా తయారు చేయని ఏజెన్సీలను వెంటనే తొలగిస్తామని ఎంఈఓ–2 చిరంజీవిరెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని కురువెళ్లి,అగ్రహారం, హత్తిబెళగల్ గ్రామ ఎంపీపీ, ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఎంఈఓ నిర్వాహకులతో మాట్లాడుతూ..తాజా కూరగాయాలు,ఆకు కూరలు వంట తయారీలో వాడాలన్నారు. పాఠశాలకు హాజరైన విద్యార్థుల శాతాన్ని బట్టి భోజనం తయారు చేయాలన్నారు. భోజనంపై ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

వరద బాధితులకు విరాళం


విరాళానికి సంబంధించిన నోట్‌ను అందిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): ఇటీవల సంభవించిన వరదల్లో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు కర్నూలు జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తమ జీతంలోని కొంత మొత్తాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేయనున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత తెలిపారు. ఇందుకు సంబంధించిన నోట్ పత్రాన్ని గురువారం జిల్లా ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో నోడల్ అఫీసర్ పద్మినికి అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌లోని ఏఐటీయూసీ, సీఐటీయూ రెండు అనుబంధ సంఘాల టీచర్ల జీతం నుంచి రూ.60, హెల్పర్ల జీతం నుంచి రూ.40 చొప్పున ఈ నెల జీతంలో కట్ చేసి రిలీఫ్ ఫండ్‌కు జమ చేయాలని కోరామన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదశి మునెప్ప, సీఐటీయూ రాధాకృష్ణ, దుర్గా పాల్గొన్నారు.

ఎల్లార్తిలో పారిశుద్ధ్య పనులు


దర్గా పరిసరాల్లో చెత్తా చెదారం తొలగిస్తున్న దృశ్యం

హొళగుంద: ఈ నెల 29వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఎల్లార్తి ఉరుసులో భక్తులకు ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో దర్గా పరిసరాల్లో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. దర్గా పరిసరాల్లోని డ్రైనేజీల్లో పూడిక, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించారు.

బాధితులకు రెడ్ క్రాస్ సొసైటీ సాయం


బాధితులకు సాయం అందిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): గత నెలలో భారీ వర్షాలకు వెల్దుర్తి మండలంలో ఇల్లు కూలిపోయి సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు అండగా నిలిచారు. అల్లుగుండు గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా, వెల్దుర్తి టౌన్‌కు చెందిన గోబీ బండి నిర్వహించుకునే ఇబ్రహీం నివాసాలు కోల్పోయిన విషయాన్ని రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యులుగా ఉన్న వెల్దుర్తికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు హరినరసింహనాయుడు సంస్థ దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి రఘునాథరెడ్డి, చైర్మన్ డాక్టర్ గోవిందురెడ్డి గురువారం బాధితులను కర్నూలుకు పిలిపించి వారికి నిత్యావసర సరుకులు, వంట సామగ్రి కిట్లును అందజేశారు. సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసులు, డీఎఫ్ఓ రమేష్, రామానాయుడు పాల్గొన్నారు.



నడవడానికీ వీలుకానంతగా!


అధ్వానంగా హొళగుందలోని అయ్యప్పస్వామి ఆలయ రస్తా

హొళగుందలోని అయ్యప్పస్వామి కాలనీతో పాటు పొలాలు, హొన్నూరు క్యాంపు వరకు స్థానికులు, భక్తులు రాకపోకలు సాగిస్తున్న తెక్కలకోట రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డుపై మురుగు ప్రవహిస్తుండంతో కనీసం నడవడానికి కూడా వీలుకానట్లుగా తయారైంది. గతంలో ఈ రోడ్డుపై హొళగుంద నుంచి కర్ణాటకలోని తెక్కలకోట గ్రామం వరకు తిరిగే వారు. ప్రస్తుతం వాల్మీకి సర్కిల్ నుంచి మొదలై అయ్యప్పస్వామి ఆలయం పక్క నుంచి హొన్నూరు కొట్టాలా, హొన్నూరు తదితర గ్రామాల మీదుగా వెళ్తుంది. పాత రోడ్డు అధ్వానంగా మారి కుంచించుకుపోయి ఆనవాళ్లు కోల్పోయింది. వర్షపునీరు, సమీప కాలనీల్లోని వృథా నీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులతో పాటు ప్రయాణికులు వాపోతున్నారు. – హొళగుంద

మామిడి మొక్కల పంపిణీ


విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న ఏడీఏ విజయమోహనరావు

దేవనకొండ: మండలకేంద్రంలోని శ్రీ వెంకటసాయి ఫర్టిలైజర్స్ యజమానులు గుంటూరు మద్దన వేణుగోపాల్, శివానందం వారి తండ్రి గుంటూరు మద్దన రామారావు జ్ఞాపకార్థం విద్యార్థులకు మామిడి మొక్కలను అందించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పత్తికొండ ఏడీఏ విజయమోహన్‌కుమార్ చేతులమీదుగా వెయ్యి మొక్కలను పంపిణీ చేయించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని సూచించారు. ఏఓ సురేష్‌బాబు, పత్తికొండ ఏఓ వెంకటరామగౌడ్, క్రిష్ణగిరి ఏఓ వెంకటేశ్వర్లు, తుగ్గలి ఏఓ పవన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంతెన..ప్రమాదం అంచున!

శిథిలమైన యాటకల్లు బ్రిడ్జి గోడలు


పూర్తిగా దెబ్బతిన్న యాటకల్లు బ్రిడ్జి


ఆస్పరి: మండలంలోని యాటకల్లు సమీపంలోని బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జి కూలిపోతే మండలంలోని యాటకల్లు, తొగలుగల్లు, కైరుప్పల, కలపరి, దొడగొండ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చాలా ఏళ్ల క్రితం యాటకల్లు వంకపై బ్రిడ్జి నిర్మించడంతో ఆస్పరి నుంచి చొక్కనహళ్లి, ఐనకల్లు, యాటకల్లు మీదుగా కైరుప్పల మీదుగా ఎమ్మిగనూరు వెళ్తున్నారు. ఈ గ్రామాల ప్రజలకు ఎమ్మిగనూరు వెళ్లేందుకు ఈ రహదారి ద్వారా దగ్గరవుతుంది. ప్రస్తుతం బ్రిడ్జి గోడలుకున్న రాళ్లు పడిపోతున్నాయి. బ్రిడ్జి మధ్యలో బీటలు వారడంతో కుంగిపోయేలా ఉంది. భారీ వర్షాలు కురిస్తే బ్రిడ్జికున్న గోడరాళ్లు కొట్టుకుపోతే బ్రిడ్జి మొత్తం కూలిపోతుందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు ముందస్తు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.